సాక్షి
రంగారెడ్డి

గురువారం । 26 । జూన్ । 2025



రీల్స్ మోజులో..

కంచన్‌బాగ్‌–చంద్రాయణగుట్ట రోడ్డులో అర్ధరాత్రి మూడు ఆటోలు విన్యాసాలు చేశాయి. 8లో▸



భూదాన భూములను..

అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ, భూదాన భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య డిమాండ్ చేశారు. 8లో▸



సమస్యల పరిష్కారానికి కృషి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్‌జీఓ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. 8లో▸

సర్వే నంబర్లు మాయం

రికార్డుల్లో ఒకరు.. పొజిషన్‌లో మరొకరు

- పక్కాగా నిర్వహిస్తే తప్పా తేలని పంచాయితీ
- వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- రెవెన్యూ సదస్సుల్లో సర్వేనంబర్ల మిస్సింగ్‌కు 8,996 ఫిర్యాదులు
- జూలై 10లోగా సమస్యల పరిష్కారం సాధ్యమేనా..?



ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లాలోని పలు భూముల సర్వే నంబర్లు మాయమయ్యాయి. క్షేత్రస్థాయిలోని భూములకు, రెవెన్యూ కార్యాలయాల్లోని రికార్డులకు అసలు పొంతన కుదరడం లేదు. జూన్ మూడు నుంచి 23 వరకు నిర్వహించిన భూ భారతి సదస్సుల్లో భాగంగా ప్రజల నుంచి సర్వే నంబర్ల మిస్సింగ్‌కు సంబంధించిన దరఖాస్తులే ఎక్కువగా అందాయి. ప్రజల నుంచి వచ్చిన ఈ అర్జీలను జూలై 10లోగా పరిష్కరించాల్సిందిగా ప్రభుత్వం సంబంధిత రెవెన్యూ అధికారులను ఆదేశించింది. భూ కొలతలు పక్కాగా నిర్వహించకుండా, ఉన్న భూములకు హద్దులు నిర్ధారించకుండా, ఏ సర్వే నంబర్‌లో..? ఏ ఏ పట్టా దారులున్నారో? తేల్చకుండా భూ సమస్యలు పరిష్కారం అవు తాయా అంటే అధికారుల వద్ద సమాధానం లేదు. అందిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా, ఆమోదించడమో..తిరస్కరించడమో? చేయాల్సి ఉంది. అకారణంగా తిరస్కరిస్తే.. ఆయా అర్జీదారులు అప్పీల్‌కు వెళ్లే అవకాశం ఉండటంతో ఏం చేయాలో? తోచక అధికారులు తలపట్టుకుంటున్నారు.

హద్దులు దాటిన గద్దలు

జిల్లాలో 12,43,035 లక్షల ఎకరాల భూములుండగా వీటిలో 2,18,53.02 ఎకరాల ప్రభుత్వ, 64,803 ఎకరాలు అటవీ భూములున్నాయి. జిల్లా వ్యాప్తంగా 90,911 ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా ఇందులో 52,315 మంది నిరుపేద రైతులకు 75,450.29 ఎకరాలను అసైన్ చేసింది. మరో 25,597.35 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.అసైన్డ్ చేసిన భూమిలో ఆ తర్వాత 9,885.13 ఎకరాలు చేతులు మారినట్లు గుర్తించి, 42,278 అసైన్డ్ ఉల్లంఘన కేసులను నమోదు చేసింది.

- భూదాన్ బోర్డు పేరున 21,931.03 ఎకరాలుండగా, దీనిలో 9,678 మంది నిరుపేదలకు పంచారు. మిగలిన భూమి కబ్జాదారుల చేతుల్లోకి వెళ్లింది. – దేవాదాయశాఖకు 9,360.01 ఎకరాల భూములు ఉండాల్సి ఉండగా, వీటిలో ఇప్పటికే 1,148.15 ఎకరాలు అన్యాక్రాంతమైంది.
- భూపరిమితి చట్టం(యూఎల్‌సీ) పరిధిలో 9 వేల ఎకరాలకుపైగా భూములుండగా.. వీటిలో 840 ఎకరాలు కోర్టు కేసుల్లో ఉన్నాయి.
- వక్ఫ్‌బోర్డు పరిధిలో 14,785.17 ఎకరాలు ఉండగా, వీటిలో ఇప్పటికే 13,480.25 ఎకరాలు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లింది.

పొజిషన్‌కు భిన్నంగా సర్వే నంబర్లు

ప్రభుత్వ, పట్టా భూములతో పాటు అటవీ, సీలింగ్, లావణి, శిఖం పట్టా భూములు కూడా ఉన్నాయి. అనేక సర్వే నంబర్లలోని భూములు రెవెన్యూ నక్షకు, విస్తీర్ణానికి భిన్నంగా ఉన్నాయి. గత ప్రభు త్వం భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌లోనూ ఈ లోపాలు భారీగా బయటపడ్డాయి. భూ విస్తీర్ణానికి మించి రికార్డుల్లో పేర్లు నమోదయ్యాయి. పొజిషన్‌కు భిన్నంగా సర్వే నంబర్లు, రికార్డులు,పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారు. నిజమైన లబ్ధిదారులతో పాటు అడ్డదారుల్లో భూములు కొల్లగొట్టిన వారు సైతం దరఖాస్తులు సమర్పించారు. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఆయా బాధితులు మాన్యువల్‌గా అందజేసిన దరఖాస్తులను, ప్రస్తుతం సిటిజన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను చేపట్టారు. ఆయా అర్జీలన్నీ భూ భారతి పోర్టల్‌కు చేరుకోనున్నాయి.

కొత్త నియామకాలు చేపట్టకుండా..

భూములన్నీ నగరానికి ఆనుకుని ఉండడం, ఐటీ, రియల్ ఎస్టేట్ కారణంగా జిల్లాలోని భూముల ధరలు అమాంతం పెరిగిపోవడం, అదే స్థాయిలో భూవిస్తీర్ణంలో హెచ్చుతగ్గులు, సరిహద్దు వివాదాలు వెలుగు చూడటం తెలిసిందే. ఈ వివాదాల పరిష్కారంలో సర్వేయర్లు ఇచ్చే రెవెన్యూ నివేదికలే కీలకంగా మారుతుంటాయి. జిల్లాలో 27 మండలాలుండగా, 526 గ్రామ పంచాయతీలున్నాయి. వీటి పరిధిలో కేవలం 14 మంది మాత్రమే సర్వేయర్లు పని చేస్తున్నారు. రెండు మండలాలకు ఒకరే సర్వేయర్ పని చేస్తున్నారు. భూ కొలతల నిర్ధారణకు సంబంధించి ప్రస్తుతం క్షేత్రస్థాయిలోని బాధితుల నుంచి వస్తున్న అభ్యర్థనలకు.. హద్దులు నిర్ధారించి ఇస్తున్న నివేదికలకు అసలు పొంతనే ఉండడం లేదు. ఒక్కో విస్తీర్ణాన్ని రెండు నుంచి మూడు సార్లు సర్వే చేయాల్సి వస్తుండడం, ప్రభుత్వ ప్రాజెక్టులకు భూమిని సేకరించడం, ప్రైవేటు వ్యక్తుల మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాల్సి వస్తుండడం ఇబ్బందిగా మారింది. పని భారంతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఇటీవల అర్హులైన ప్రైవేటు వ్యక్తులను (లైసెన్స్‌డ్ సర్వేయర్లు) ఎంపిక చేసి నెల రోజులుగా శిక్షణ ఇస్తోంది. ఏళ్ల తరబడి కొత్త వాళ్లను నియమించకుండా పాతవాళ్లకు పని భారాన్ని తగ్గించకుండా మాయమైన ఈ సర్వే నంబర్ల గుర్తింపు ఎలా సాధ్యమవుతుందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం ఆశిస్తున్నట్లు జూలై పది లోగా ఈ సమస్యలన్నింటికీ పరిష్కార మార్గం లభిస్తుందా? అంటే అనుమానమే.

రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులు ఇలా..

అంశం	అర్జీలు
పంపిణీ చేసిన దరఖాస్తులు	34,453
ప్రజల నుంచి అందిన అర్జీలు	21,050
మిస్సింగ్ సర్వేనంబర్లు	8,966
మ్యూటేషన్ పెండింగ్	1,165
డీఎస్ పెండింగ్	1,158
ఎక్స్‌టెంట్ కరెక్షన్	1,932
లాండ్ నేచర్/క్లాసిఫికేషన్	967
నేమ్ కరెక్షన్	742
నిషేధిత జాబితా నుంచి తొలగించుటకు	1,557
నిషేధిత జాబితాలో చేర్చేందుకు	08
అసైన్డ్ భూముల సమస్యలు	656
ఓఆర్‌సీ నాట్ ఇష్యూడ్	142
38ఇ సర్టిఫికెట్ నాట్ ఇష్యూడ్	24
సక్సేషన్ పెండింగ్	1,652
భూ సేకరణ	64
ఇతర సమస్యలు	2,217

జులై 10లోగా దరఖాస్తులను పరిష్కరించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: భూ భారతి చట్టంలోని నిబంధనల మేరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటికీ జులై 10లోగా పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో భూ భారతి దరఖాస్తులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జూన్ మూడు నుంచి 23 వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన 21 వేల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన వారికి న్యాయం చేయాలన్నారు. కోర్టు కేసులు ఏమైనా ఉన్నాయో? తెలుసుకుని, ఒకవేళ కోర్టు ఆర్డర్ ఉంటే పట్టాదార్ పాసు పుస్తకాలు ఇవ్వరాదని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌ఓ సంగీత, కలెక్టరేట్ సూపరింటెండెంట్స్, ఆర్డీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

రేపు మార్కెట్ దుకాణ సముదాయం ప్రారంభం



మార్కెట్‌యార్డులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన దుకాణ సముదాయాన్ని ఈ నెల 27న ప్రారంభించనున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఏఎంసీ వైస్ చైర్మన్ గూడురు భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం వారు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో దుకాణ సముదాయం ప్రారంభ ఏర్పాట్లను మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం నర్సింహ, భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. మార్కెట్ యార్డులో రూ.65లక్షలు వెచ్చించి ఎనిమిది దుకాణాలు నిర్మించామని.. ఈ దుకాణాలను శుక్రవారం నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు శ్రీశైలం, పాండురంగయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాహక్కు చట్టం అమలు చేయండి

డాక్టర్ చంటి ముదిరాజ్



వినతిపత్రం అందజేస్తున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ సభ్యులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అధిక ఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చంటి ముదిరాజ్, అధ్యక్షురాలు సూర స్రవంతి, ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం డీఈఓ సుశీందర్ రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఫీజులను నియంత్రించి, విద్యాహక్కు చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేదలకు ఉచితంగా కేటాయించాలని కోరారు. ఆ మేరకు యాజమాన్యాలపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్.దిలీప్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

ఆమనగల్లు: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సక్రునాయక్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయం కమిషనర్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సక్రునాయక్ మాట్లాడుతూ.. ప్రభు త్వం మున్సిపల్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ రూ.25 వేల కనీస వేతనం, కార్మికులకు ఇచ్చే కిట్లు, వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్మికులు విజయ, వెంకటమ్మ, లక్ష్మమ్మ, పెంటయ్య,రాములు, మహేందర్, శ్రీను, మహేశ్, ప్రశాంత్, విజయ్, మేఘ్య పాల్గొన్నారు.

బోనాల నిర్వహణకు రూ.20 కోట్లు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో బోనాల నిర్వహణకు 2,783 దేవాలయాలకు ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేసిందని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి వివరించారు. బోనాల సందర్భంగా దేవాలయాల్లో ఊరేగింపు దశ గతంలో స్వాగతం, శోభాయాత్ర, తొట్టెల ఊరేగింపు, పోతురాజుల వీరంగాలు , ఎదుర్కోలు, అమ్మవార్లకు బోనాల సమర్పణ, పట్టు వస్త్రాల సమర్పణ, కళా ప్రదర్శనలు కార్యక్రమాల నిర్వహణకు నిధులు వెచ్చించనున్నట్లు మంత్రి పేర్కొన్నారు.



పేరెంట్స్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర విద్య కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

విద్యావ్యవస్థలో మార్పే లక్ష్యం

- అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యమే ప్రధానం
- విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల: అభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం ఉంటేనే ఏ కార్యక్రమైనా విజయవంతం అవుతుందని రాష్ట్ర విద్యాశాఖ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. మండల పరిధిలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్‌స్కూల్‌లో కొనసాగుతున్న పనులు, పాఠశాల నిర్వహణ తీరును పరిశీలించేందుకు బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన వంగూరు, పోల్కంపల్లి గ్రామాలకు చెందిన పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు 150 మంది విచ్చేశారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యావ్యవస్థలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వివరించారు. ఇందులో భాగంగా ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్చామన్నారు. పేరెంట్స్ కమిటీ సహకారంతో 90 శాతం పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 2 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారని చెప్పారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించడంతో పాటు రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంచాల ఎంఈఓ రాందాస్, ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, సుప్రియ, ఉపాధ్యాయులు కిషన్ చౌహాన్, మోహన్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ఎం.డీ.జానీపాషా, నూకం రాజు, భాస్కర్, జంగయ్య, శ్రీశైలం, స్వాతి, జ్యోతి, పారిజాత, సంధ్య, పార్వతి, మల్లేశ్ తదితరులుపాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల పండగ

సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆకాక్షించారు. గోల్కొండలో వెలసిన జగదాంబిక అమ్మవారికి ఆషాఢ మాసం తొలి బోనం సమర్పించడంతో జంట నగరాల్లో సందడి నెలకొంటుందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, ఆయురోగ్యాలతో జీవించాలని రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని సీఎం ఆకాంక్షించారు. జంట నగరాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసిందన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సీఎం సూచించారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మావతి

యాచారం: విత్తనాలు, ఎరువుల విక్రయాల్లో రైతులను మోసం చేస్తే జైలు శిక్ష తప్పదని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మావతి హెచ్చరించారు. బుధవారం ఆమె మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువులు విక్రయించే దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఏ ధరకు విత్తనాలు, ఎరువులు అమ్ముతున్నారు, ధరలు ఎలా ఉన్నాయి, రైతులకు రసీదులు ఇస్తున్నారా.? కాలం చెల్లిన విత్తనాలను, ఎరువులను రైతులకు విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులు అధిక లాభార్జన ఆశతో రైతులను మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొనుగోళ్లపై రైతులకు వెంటనే రసీదులు ఇవ్వాలని సూచించారు. స్టాక్‌బోర్డులు, ధరల పట్టిక ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌పోర్స్ సీఐ ముద్రాస్ అలీ, సీడ్స్ సర్టిఫికేషన్ అధికారి లావణ్య, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ పాల్గొన్నారు.

ఫెర్టిలైజర్ షాపుల తనిఖీ



యాచారం: ఫెర్టిలైజర్ దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న పద్మావతి

మాడ్గుల: మండల స్థాయి అధికారులు రైతులకు అందుబాటులో ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు అందించాలని జిల్లా వ్యవసాయ శాఖ ఏడీఏ పద్మజ అన్నారు. బుధవారం ఆమె మండలంలో ఆకస్మికంగా పర్యటించారు. ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. అనంతరం వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. పంటల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విత్తన ధ్రువీకరణ అధికారి లావణ్య, ఎస్‌ఓటీ అధికారులు ముదస్సిర్ అలీ, వ్యవసాయ అధికారి అరుణ కుమారి తదితరులు ఉన్నారు.




తోలుకట్టలో ప్రభుత్వ భూమిని కబ్జా నుంచి విడిపించి బోర్డు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు

మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్

మొయినాబాద్: ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని తోలుకట్ట రెవెన్యూలోని సర్వేనెంబర్ 155లో 1.14 ఎకరాల ప్రభుత్వ భూమిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను బుధవారం రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి జేసీబీతో కూల్చివేశారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని కాపాడి బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాదారులు ప్రభుత్వ భూముల జోలికొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి రక్షించడంకోసం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ ఆదేశాలతో త్వరలో ఫెన్సింగ్ వేయడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు. సూచిక బోర్డులు సైతం ఏర్పాటు చేసి ప్రభుత్వ భూములపై నిఘా పెడతామన్నారు. ఎవరైనా ప్రభుత్వ భూము ల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినా, కబ్జా చేసిన స్థానిక ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కూల్చివేతల్లో ఆర్ఐ రాజేశ్, సిబ్బంది భాస్కర్, భరత్, అంజయ్య తదితరులు ఉన్నారు.

మరకత శివాలయంలో ప్రత్యేక పూజలు




సుహాసినిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి: మండల పరిధిలోని చందిప్ప మరకత శివాలయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య కోడలు సుహాసిని సందర్శించారు. బుధవారం ఆమె ఆలయంలోని మరకత శివలింగానికి సమీప బంధువుతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమెకు(నీలి రంగు చీర ధరించిన) ఆలయ గౌరవ అధ్యక్షుడు సదానందంగౌడ్, చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు సాయిశివలు శాలువాతో సత్కరించారు. మరకత శివాలయాలు చాలా అరుదుగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దర్శన్‌గౌడ్, అనంత్‌రెడ్డి పాల్గొన్నారు.

‘స్థానిక’ సందడి!

- హైకోర్టు తీర్పుతో పల్లెల్లో మళ్లీ కదలిక
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- రిజర్వేషన్లపై కొనసాగుతున్న ఉత్కంఠ



సాక్షి, రంగారెడ్డిజిల్లా: స్థానిక సంస్థల ఎన్నికలకు లైన్ క్లియరైంది.మూడు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటి కే గ్రామ పంచాయతీలు, వార్డులు, ఓటర్ల జాబితా ను సిద్ధంగా ఉంచిన అధికార యంత్రాంగం మరో సారి వాటిని సరి చూసుకునే పనిలో నిమగ్నమైంది. 2024 జనవరి 30తో స్థానిక సంస్థల పాలకవర్గాల గడువు ముగిసింది. నాటి నుంచి ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలోనే కొనసాగుతున్నాయి. పాలక మండళ్లు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన నిధులు అందక అధికారులు ట్రాక్టర్ డీజిల్ ఖర్చులు, వీధి లైట్లు, డ్రైనేజీల క్లీనింగ్, బోరుబావుల, మోటార్ల రిపేర్లకు అప్పులు చేయాల్సిన దుస్థితి. దీంతోపాటు ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన వారు సైతం ఓటర్లను ఆకర్షించేందుకు భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వచ్చింది. ఎన్నికల నిర్వహణ పై హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో ఆయా గ్రామాల్లో మళ్లీ సందడి మొదలైంది. అయితే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన అమలు అంశంపై ఇప్పటికీ ఓ స్పష్టత రాకపోవడం ఆశావహులను ఒకింత ఆందోళనకు గురి చేస్తోంది.

ఎంపీటీసీ, జెడ్పీటీసీలా? సర్పంచ్‌లా?

జిల్లాలో కొత్త మున్సిపాలిటీల ఏర్పాటు.. ఔటర్ లోపల ఉన్న పాత మున్సిపాలిటీల్లో సమీప గ్రామాల విలీనంతో జిల్లాలో ఎంపీటీసీ స్థానాలతో పాటు సర్పంచ్ స్థానాలు తగ్గాయి. గతంలో 13 మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లు ఉండగా, కొత్తగా మొయినాబాద్, చేవెళ్ల మున్సిపాలిటీలు ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ స్థానాల సంఖ్య 257 నుంచి 232కి తగ్గింది. జిల్లా వ్యాప్తంగా గతంలో 558 గ్రామ పంచాయతీలుండగా, ప్రస్తుతం 32 గ్రామాలు ఆయా మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో వీటి సంఖ్య 526కు చేరింది. ఇటీవల కొత్తగా మరికొన్ని గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. అయితే స్థానిక సంస్థల్లో బీసీ కోటా అమలు చేయాలని కోరుతూ కొంత మంది కోర్టును ఆశ్రయించడం, ఇదే అంశంపై ప్రభుత్వం కొంత వరకు కసరత్తు చేయడం తెలిసిందే. అయితే ఇపటి వరకు ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ ఎన్నికల్లోనూ పాత రిజర్వేషన్ పద్ధతినే కొనసాగిస్తారా? కొత్తగా ఏమైనా మార్పులు తీసుకొస్తారా? అనే అంశంపై స్పష్టత కొరవడింది. ముందుగా జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తారా? లేక సర్పంచులు, వార్డు సభ్యులకు నిర్వహిస్తారా? అనేది కూడా తేలాల్సి ఉంది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో జిల్లా పంచాయతీ అధికారులు అలెర్ట్ అయ్యారు. ఓటర్ల జాబితా, వార్డులు, పంచాయతీలు తదితర వివరాలను సరిచూసుకునే పనిలో పడ్డారు.

జిల్లా రాజకీయ స్వరూపం

మండలాలు	21
ఎంపీటీసీ స్థానాలు	232
ఎంపీపీలు	21
జెడ్పీటీసీలు	21
పంచాయతీలు	526
వార్డులు	4,896
మొత్తం ఓటర్లు	7,94,653
పురుషులు	3,99,404
మహిళలు	3,95,216
ఇతరులు	33
మున్సిపాలిటీలు	15
మున్సిపల్ కార్పొరేషన్లు	3
అసెంబ్లీ నియోజకవర్గాలు	8

జీహెచ్ఎంసీ డివిజన్లు

మహేశ్వరం	02
ఎల్బీనగర్	11
గచ్చిబౌలి	07
రాజేంద్రనగర్	05

భూదాన భూములను కాపాడాలి


సీపీఐ జెండాను ఆవిష్కరిస్తున్న జంగయ్య

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య

షాబాద్: అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ, భూదాన భూములను కాపాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ భవన్‌లో సీపీఐ మండల మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడంతో అక్రమార్కులు అసైన్డ్ భూములను యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, ఆనాటి బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమ స్ఫూర్తితో ఈ దేశంలో విప్లవ ఉద్యమాలు జరిగాయన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ కార్యకర్తలు ప్రజలు ఆందోళన నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభులింగం, మండల కార్యదర్శి జంగయ్య, నాయకులు సత్తిరెడ్డి, మక్బూల్, మంజుల, అంజయ్య, రఘురాం, మధు, నారాయణ, రుక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అనంతరం సీపీఐ షాబాద్ మండల నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జంగయ్య ప్రకటించారు. మండల కార్యదర్శిగా నాగర్‌కుంట గ్రామానికి చెందిన పాలమాలకు శ్రీశైలంను ఎనుకున్నారు. సహాయ కార్యదర్శులుగా గడ్డం వెంకటేష్, రాములు, వీరితో పాటు 15 మంది కౌన్సిల్ సభ్యులను కమిటీలోకి తీసుకున్నారు.

రీల్స్ మోజులో దుస్సాహసాలు!

నడిరోడ్లపై యువత స్టంట్లు!

- చీకటిపడితే చాలు అనేక రహదారులపై ఇవే సీన్లు
- ఇటీవల టూవీలర్‌పై ఎనిమిది మంది ప్రయాణం
- సోషల్‌మీడియాపై నిఘాతో పట్టుకున్న పోలీసులు
- డ్రోన్లనూ వినియోగిస్తేనే పూర్తిస్థాయిలో ఫలితాలు



మాదాపూర్, రాయదుర్గం ఏరియాల్లో బైకు, ఆటోలతో స్టంట్లు

సాక్షి, సిటీబ్యూరో: కంచన్‌బాగ్–చంద్రాయణగుట్ట రోడ్డులో అర్ధరాత్రి మూడు ఆటోలు విన్యాసాలు చేశాయి. ఈ దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో స్పందించిన పోలీసులు ఏడుగురిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు.

- బేగంపేట–ప్రకాష్‌నగర్ మార్గంలో ఏడుగురు యువకులు అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేశారు. రేసింగ్‌తో పాటు వీళు చేసిన ఫీట్లు సోషల్ మీడియా ద్వారా పోలీసుల దృష్టికి రావడంతో కేసు నమోదు చేసిన అధికారులు ఏడుగురిని అరెస్టు చేశారు.
- శంషాబాద్–రాజేంద్రనగర్ మార్గంలో ఈ–బైక్‌పై ప్రయాణించిన ఎనిమిది మంది రహదారిపై ఫీట్లు చేశారు. సోషల్ మీడియాలో పోస్టు చేయడానికి చేసిన ఈ దుస్సాహసం దాని ద్వారానే పోలీసుల దృష్టికి వెళ్లింది. దీంతో రాజేంద్రనగర్ పోలీసులు వీరిపై కేసు నమోదు చేశారు.

...ఇవన్నీ పోలీసుల రికార్డుల్లోకి ఎక్కిన స్టంట్లు. అయితే వీరి దృష్టిలో పడకుండా అనునిత్యం నగరంలోని అనేక ప్రాంతాల్లో యువత రెచ్చిపోతున్నారు. వాహనాలపై తిరుగుతూ ప్రమాదకరమైన స్టంట్లు, ఫీట్లు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. సోషల్‌మీడియా ప్రభావంతో రీల్స్ చేసి, లైక్స్–షేర్స్ పొందడానికి ఎక్కువగా చేస్తున్నారు.

ఆయా ప్రాంతాల్లో రాత్రి వేళ...

నడిరోడ్లపై సాగే ఈ సర్కస్ ఫీట్లలో పాల్గొంటున్నవారంతా యువకులే ఉంటున్నారు. ప్రధానంగా ఇన్నర్ రింగ్ రోడ్‌తో పాటు రాజేంద్రనగర్, రాయదుర్గం, మాదాపూర్, బోయిన్‌పల్లి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, బోయిన్‌పల్లి, ఔటర్ రింగ్ రోడ్‌కు సంబంధించిన సర్వీస్ రోడ్డులోని కొన్ని చోట్ల ఈ విన్యాసాలు ఎక్కువగా జరుగుతున్నట్లు పోలీసులు గుర్తించారు. అర్ధరాత్రి వేళల్లో సాగుతున్న వీటి వల్ల ఇతరులకు ఇబ్బందికరంగా మారడంతో పాటు ఆ వాహనచోదకులకు, ఎదుటి వారికీ ప్రమాదహేతువులుగా మారే ప్రమాదం ఉందని పోలీసులు గుర్తించారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో నిఘా ఉంచుతున్నప్పటికీ పూర్తి స్థాయిలో ఫలితం ఉండట్లేదు.

జరిగిన తర్వాతే పట్టుకుంటున్నారు...

ఈ స్టంట్ల విషయంలో పోలీసులు అవసరమైన స్థాయిలో 'ముందస్తు' చర్యలు తీసుకోవట్లేదనే విమర్శ ఉంది. ఎప్పుడో అడపాదడపా మినహా ఎక్కువ సందర్భాల్లో ఫీట్లు పూర్తయిన తర్వాతే అది పోలీసుల దృష్టికి వెళ్తోంది. ఈ ఫీట్లు, స్టంట్లలో ఒకే వాహనంపై ఎక్కువ మంది ప్రయాణించడం, వెనుక చక్రంతో రోడ్డుపై రాపిడి కలిగిస్తూ పోగ వచ్చేలా చేయడం (వీలింగ్), వాహనం స్టాండ్‌తో పాటు ఇతర భాగాలు రోడ్డుకు తాకేలా చేసి, వేగంగా దూసుకుపోతూ నిప్పు రవ్వలు రప్పించడం (స్పార్కింగ్), ఆటోను ఓ వైపునకు ఎత్తేసి ప్రమాదకరంగా నడపటం వంటివి ఎక్కువగా జరుగున్నాయి. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారిన తర్వాతే పోలీసుల దృష్టికి వస్తున్నాయి. దీంతో ఆయా వాహనాల నెంబర్ల ఆధారంగా ముందుకు వెళ్తున్న పోలీసులు వారిని పట్టుకుని చర్యలు తీసుకుంటున్నారు.

డ్రోన్ల సాయంతో నిఘా ఉంచితేనే...

స్టంట్లు చేయడం పూర్తయిన తర్వాత వీడియోలు, సీసీ కెమెరాల ఆధారంగా బాధ్యుల్ని పట్టుకోవడంతో ఫలితం లేదనే వాదన వినిపిస్తోంది. ఈలోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ఇలాంటి దుస్సాహసాలను ముందే గుర్తించి అణిచివేయాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనికోసం స్టంట్లు జరిగే ఆస్కారం ఉన్న ప్రాంతాల్లో పెట్రోలింగ్ సిబ్బందితో పాటు డ్రోన్ల సాయంతో నిఘా ఉంచాలని సూచిస్తున్నారు. ఇప్పటికే నగర పోలీసు విభాగం ట్రాఫిక్ నియంత్రణకు రెండు డ్రోన్లు వాడుతోంది. వీటిని రేసులు, స్టంట్ల నిరోధానికి వాడాలని కోరుతున్నారు. ఈ డ్రోన్లు గరిష్టంగా 250 మీటర్ల ఎత్తులో, 25 కిమీ పరిధిలో నిఘా ఉంచగలుగుతాయని, '28ఎక్స్' వరకు జూమ్ చేసుకునే సామర్థ్యం వీటి ద్వారా స్టంట్లకు అడ్డుకట్ట వేయాలని సూచిస్తున్నారు. సాధారణ ప్రజలతో పాటు తోటి ప్రయాణికుల భద్రతకు ముప్పుగా మారే ఈ తరహా రేసింగ్స్, స్టంట్స్‌కు సంబంధించి బాధ్యులపై బీఎన్ఎస్‌తో పాటు మోటారు వాహన చట్టం, సీపీ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెప్తున్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఇబ్రహీంపట్నం: వేగంగా వచ్చిన లారీ అదుపు తప్పి స్కూటర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగల్‌పల్లి చౌరస్తా వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ఉప్పరిగూడ గ్రామానికి చెందిన బుట్టి ప్రేమ్‌రాజ్(65) వాటర్ ప్లాంట్ వర్కర్‌గా పనిచేస్తూ బొంగుళూర్‌లో నివాసముంటున్నాడు. ఉప్పరిగూడ నుంచి ఇంటికెళుతుండగా ప్రేమ్‌రాజ్ స్కూటర్‌ను ఇబ్రహీంపట్నం వైపు నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలవ్వడంతో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, మృతదేహన్ని మార్చురీకి తరలించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

పట్టుబడిన నల్లబెల్లం ధ్వంసం


బెల్లాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఆమనగల్లు: వివిధ కేసుల్లో పట్టుబడిన నాటు సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం, ఇతర ముడి పదార్థాలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యానాద్‌చౌహాన్ ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. పట్టణ సమీపంలో పెద్ద గోతిని తీసి మున్సిపాలిటీ సిబ్బంది సహాయంతో వివిధ కేసులలో పట్టుబడిన 780 కిలోల నల్లబెల్లం, 80 కిలోల పటిక, 40 కిలోల విప్పపువ్వును నాశనం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐలు కృష్ణప్రసాద్, అరుణ్‌కుమార్, సిబ్బంది శంకర్, దశరథ్, బాబు, లోక్య, శ్రీను, ఉపేందర్, శ్రీజ, ఆమని తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న జగదీశ్వర్

టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

చేవెళ్ల: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్‌జీఓ నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని అట్లాస్ మినీ ఫంక్షన్ హాల్‌లో బుధవారం టీఎన్‌జీఓ చేవెళ్ల తాలూకా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పెద్ద మనసుతో ఒక డీఏ ఇచ్చిందని, త్వరలో మిగతా సమస్యలు కూడా పరిష్కరిస్తుందన్నారు. అర్థ గణాంక, ఐసీడీఎస్ శాఖల్లో పోస్టుల ఏర్పాటులో టీఎన్‌జీఓ కీలకంగా పనిచేసిందన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘాన్ని బలోపేతం చేయటంతోపాటు ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఉద్యోగులు మెడికల్ బిల్లులు ఇప్పటికే క్లియర్ చేశారని జీపీఎఫ్ బిల్లులు కూడా త్వరలో క్లియర్ అవుతాయని చెప్పారు. టీఎన్‌జీఓలంతా సమష్టిగా ఉండి సమస్యలను పరిష్కరించుకుందామన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు మాధవ్‌గౌడ్, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు విజయ్ కుమార్, అజ్మత్‌పాషా, చేవెళ్ల తాలూకా అధ్యక్ష కార్యదర్శులు శివకుమార్, జ్యోతి, డివిజన్ కోఆర్డినేటర్ శేఖర్, శ్రీకాంత్‌గౌడ్, నాయకులు వాణి, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ప్రశాంత్ (ఫైల్)

కేశంపేట: పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగిరాకపోవడం, చుట్టుముట్టిన ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని లేమామిడి శివారు తుర్కలపల్లికి చెందిన దిద్దెల ప్రశాంత్ (30) కూలీ పనులు చేస్తూ భార్య కృష్ణవేణి, ఇద్దరు పిల్లలతో కలిసి జీవించేవాడు. కొంత కాలంగా ఆర్థిక సమస్యలు నెలకొడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం కృష్ణవేణి పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనెల 23న ఆమెను తీసుకువచ్చేందుకు వెళ్లగా తిరస్కరించడంతో మరుసటి రోజు తిరిగి వచ్చేశాడు. ఈక్రమంలో మంగళవారం రాత్రి తన ఇంట్లోని రేకుల పైపునకు ఉరేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని, తలకొండపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగానే తన కొడుకు ఆత్మహత్య చేసుకున్నాడని ప్రశాంత్ తండ్రి దిద్దెల పెద్దయ్య పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

మహిళపై అసభ్య ప్రవర్తన

ముగ్గురిపై కేసు నమోదు

మీర్‌పేట: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురిపై మీర్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. లెనిన్‌నగర్‌కు చెందిన ఓ మహిళ(40) మాదన్నపేట మార్కెట్‌లో పని నిమిత్తం వెళ్లేందుకు బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరింది. లెనిన్‌నగర్ బస్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉంది. అదే సమయంలో స్కూటీపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెతో ఏదో మాట్లాడుతున్నట్లు చేసి అనంతరం చేయి పట్టుకుని బూతులు తిడుతూ అసభ్యంగా ప్రవర్తించి అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం బాధితురాలు మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏవీ ఇన్‌ఫ్రాకాన్ సీఎండీ విజయ్ అరెస్టు

సాక్షి, సిటీబ్యూరో: ప్రీలాంచ్, బైబ్యాక్ స్కీమ్‌ల పేరిట అమాయకులను నమ్మించి నట్టేట ముంచిన ఏవీ ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గోగుల లక్ష్మీ విజయకుమార్‌ను సైబరాబాద్ ఆర్థిక నేరాల నియంత్రణ విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. డీసీపీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడకు చెందిన లక్ష్మీ విజయకుమార్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 2021లో ఏవీ ఇన్‌ఫ్రాకాన్, ఏవీ ఆర్గానో ఫార్మ్స్ పేరిట కంపెనీలను ప్రారంభించాడు. తక్కువ సమయంలో అధిక లాభాలు అందిస్తానని తప్పుడు హామీలతో పెట్టుబడిదారులను ఆకర్షించాడు. పెట్టుబడిదారులను నమ్మించేందుకు సేల్ అగ్రిమెంట్, ఎంఓయూ చేసుకునేవాడు. రూ.10 లక్షలు డిపాజిట్ చేస్తే ఏడాది కాలం తర్వాత ప్రిన్సిపల్ అమౌంట్‌తో పాటు 50 శాతం అదనపు సొమ్మును మొత్తంగా రూ.15 లక్షలు ఇస్తానని పెట్టుబడిదారులను నమ్మించాడు. అలాగే ఇన్వెస్టర్లు రూ.10 లక్షలు, రూ.20 లక్షలు డిపాజిట్ చేస్తే.. ఏడాది తర్వాత చెల్లించిన సొమ్ము ఖరీదు చేసే ఓపెన్ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయడంతో పాటు చెల్లించిన సొమ్ములో 50 శాతం అదనంగా అందిస్తామని మాయమాటలు చెప్పాడు. ఇలా వందలాది అమాయకుల నుంచి అక్రమంగా రూ.8 కోట్ల మేర డిపాజిట్లు వసూలు చేశాడు. ఆ తర్వాత చేతులెత్తేశాడు. ఈ మేరకు వనస్థలిపురంకు చెందిన బాధితుడు భూపతి ప్రదీప్ సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడు విజయ్‌ను మంగళవారం ఒంగోలులో అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు.

భార్యపై దాడి.. భర్తపై కేసు నమోదు

బంజారాహిల్స్: అరుణాచలం క్షేత్రానికి వెళ్దామంటూ భార్యను, ఇద్దరు కుమారులను కారులో తీసుకువెళ్లిన వ్యక్తి మార్గమధ్యంలో భార్యపై దాడి చేసి గాయపరిచిన ఘటనలో నిందితుడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–14లోని వెంకటేశ్వరనగర్‌లో నివసించే నేనావత్ కృష్ణవేణి (30)కి 2011లో విజయ్‌కుమార్‌తో వివాహమైంది. వీరి మధ్య కొద్ది రోజులుగా మనస్పర్థలు వచ్చి ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో కృష్ణవేణి పిల్లలను తీసుకుని కర్నూలులోని తన పుట్టింటికి వెళ్లింది. మళ్లీ రాజీ పడి భర్త దగ్గరకు వచ్చింది. ఈ నెల 18న విజయ్‌కుమార్ భార్యాపిల్లలను అరుణాలచం వెళ్దామంటూ కారులో ఎక్కించుకుని వెళ్తుండగా..కర్నూలు టోల్‌గేట్ వద్ద కారు ఆపి భార్యను తీవ్రంగా కొట్టాడు. దీంతో ఆమె భర్త నుంచి తప్పించుకుని పరుగులు తీసింది. సమీపంలోని పెట్రోల్ బంకులో తలదాచుకుని డయల్ 100కు ఫిర్యాదు చేసింది. పోలీసుల సహాయంతో భర్త దాడి నుంచి బయటపడి కర్నూలులో ఫిర్యాదు చేసింది. అక్కడ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. గతంలో కూడా బాధితురాలు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లోనూ, వెస్ట్‌జోన్ ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లోనూ భర్త పైశాచికత్వంపై ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదయ్యాయి. నిందితుడు విజయ్‌కుమార్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడని, తనను, పిల్లలను శారీరకంగా, మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తున్నాడని, ఆయన బారి నుంచి రక్షించాలంటూ బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అతిగా మద్యం తాగించి లైంగిక దాడి

గచ్చిబౌలి: వైన్ షాపు ముందు పరిచయమైన ఓ యువకుడు అతిగా మద్యం తాగించి యువతిపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న తెలిపిన ప్రకారం.. ఈవెంట్లలో డ్యాన్సర్‌గా పని చేసే ఓ యువతి(23) సోమవారం రాత్రి గచ్చిబౌలి జంక్షన్‌లోని వైన్ షాపు వద్ద మద్యం తాగుతోంది. కుక్‌గా పనిచేసే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన ప్రకాష్ అదే వైన్ షాపు వద్దకు వచ్చాడు. మద్యం తాగుతున్న యువతిని పరిచయం చేసుకొని..ఇలా రోడ్డుపై తాగితే మంచిది కాదని చెప్పాడు. దగ్గర్లోనే తన రూమ్ ఉందని నమ్మించి తీసుకెళ్లాడు. ఇద్దరు మద్యం తాగి నిద్రపోయారు. రాత్రి 2 గంటలకు యువతికి మెళకువ రావడంతో.. ఒంటిపై బట్టలు లేకపోవడంతో లైంగిక దాడి జరిగిందని ఫిర్యాదు చేసింది.

కారు ఢీకొని ఇద్దరు మహిళలు మృతి

- ప్రాణాపాయ స్థితిలో మరో మహిళ
- స్కూటీని కారు ఢీకొట్టడంతో ప్రమాదం
- మొయినాబాద్ మండలం రెడ్డిపల్లి సమీపంలో ఘటన


అశ్విని


సుశీల

మొయినాబాద్: కారు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఇద్దరు మహిళలను బలిగొంది. మరో మహిళ మృత్యువుతో పోరాడుతోంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఖైరతాబాద్‌కు చెందిన నందకిషోర్, అశ్విని(37) దంపతుల పిల్లలు మొయినాబాద్‌లోని సుజాత స్కూల్‌లో చదువుతున్నారు. దీంతో వీరి కుటుంబం కొంతకాలంగా హిమాయత్‌నగర్‌లో అద్దెకు ఉంటున్నారు. బుధవారం ఉదయం 11 గంటలకు అశ్విని తన మరదలు లక్ష్మి స్కూటీపై రెడ్డిపల్లిలోని మీసేవ కేంద్రానికి బయలుదేరారు. చిలుకూరుకు వెళ్లగానే మేడిపల్లికి చెందిన కుమ్మరి సుశీల(60) యూకో బ్యాంకుకు వచ్చి తిరిగి వెళ్లేందుకు వీరిని లిఫ్ట్ అడిగింది. ముగ్గురూ స్కూటీపై వెళ్తుండగా రెడ్డిపల్లి సమీపంలో ఎదురుగా వచ్చిన కారు అతివేగంతో ఢీకొట్టింది. దీంతో ముగ్గురూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. తీవ్ర గాయాలపాలైన వీరిని చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అశ్విని, సుశీల మృతిచెందారు. లక్ష్మి పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

అర కిలోమీటర్ దూరంలోనే...

స్కూటీపై వెళ్తున్న మహిళలు మరో రెండు నిమిషాల్లో గమ్య స్థానానికి చేరుకునేవారు. అరకిలోమీటర్ దూరంలో దూరంలో ప్రమాదానికి గురికావడంతో ఇద్దరి ప్రాణాలు గాల్లో కలిశాయి. కారు అతివేగమే ప్రమాదానికి కారణంగా పోలీసులు గుర్తించారు. ఘటన జరిగిన చోట ఓ షాపులో ఉన్న సీసీ కెమరాల్లో ప్రమాదం జరిగిన తీరు నిక్షిప్తమైంది. కారు అతివేగంతో వచ్చి స్కూటీని ఢీకొట్టినట్లు సీసీ టీవీలో రికార్డయ్యింది.

అంతర్రాష్ట్ర చైన్ స్నాచర్ అరెస్టు

బంగారం చోరీ చేసి యూపీకి పరారీ


వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: మహిళల మెడలో బంగారు పుస్తెల తాళ్లనే లక్ష్యంగా చేసుకొని చోరీలకు తెగబడుతున్న ఓ దుండగుడిని పోలీసులు అరెస్టు చేసి కటకటాల పాలు చేశారు. బుధవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో సీఐ విజయ్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నాగులపల్లి గ్రామానికి చెందిన నల్లపురం బల్వంత్‌రెడ్డి, అనసూయ దంపతులు ఈ నెల 11న ద్విచక్ర వాహనంపై రామేశ్వరం దైవ దర్శనానికి వెళుతున్నారు. హాజిపల్లి శివారు దాటుతుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వెనక నుంచి వచ్చి అనసూయ మెడలో ఉన్న నాలుగున్నర తులాల బంగారు పుస్తెల తాడును తెంచుకొని పారిపోయారు. ఈ ఘటనపై దంపతులు అదే రోజు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారీగా సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించారు. పోలీసులు లక్నోలో ప్రధాన నిందితుడు మహేంద్రరాస్తోగిని అరెస్టు చేయగా, మరో నిందితుడు చాంద్‌బాబు పరారీలో ఉన్నాడు. తమదైన శైలిలో విచారించగా ప్రధాన నిందితుడు నేరాన్ని అంగీకరించాడు. నిందితుడి నుంచి ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. అతడిపై కర్నూల్, విజయనగరం, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, షాద్‌నగర్, అల్వాల్, బాచుపల్లితో పాటుగా ఉత్తర్‌ప్రదేశ్‌లో బైక్, చైన్‌స్నాచింగ్, మర్డర్, గంజాయికి సంబంధించి 20పైగా కేసులు ఉన్నాయి. చాకచాక్యంగా కేసును ఛేదించిన క్రైమ్ పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

బీసీల హక్కులపై చర్చించండి


ఆర్.కృష్ణయ్యను కలిసిన బీసీసేన నాయకులు

షాద్‌నగర్‌రూరల్: హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యను బీసీసేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీల హక్కుల సాధన కోసం, బీసీసేన గ్రామ కమిటీలు, కార్యాచరణపై చర్చించారు. బీసీలకు రావాల్సిన 42 శాతం రిజర్వేషన్‌పై ప్రభుత్వంతో చర్చించాలని ఆర్.కృష్ణయ్యను నాయకులు కోరారు. గ్రామీణ స్థాయి నుంచి బీసీసేన కమిటీలను పటిష్టంగా వేసుకోవాలని, కులాలకతీతంగా భాగస్వాములను చేయాలని కృష్ణయ్య సూచించారు. బీసీలను అన్ని రంగాల్లో చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయనను నాయకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీసేన నాయకులు సుధాకర్, దయాకర్‌చారి, బాల్‌రాజ్, మహేందర్‌గౌడ్, వెంకటయ్య, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.